# ఒక మౌనం పలికింది

## హృదయాన్ని స్పందింపచేసిన రేఖకు,

### హృదయ స్పందన తెలియపర్చాలన్న ఆకాంక్షతో వ్రాస్తోన్న లేఖ!

-కంటపల్లి సన్యాసిరాజు

కలసి ఉంటే కలదు సుఖం... కాని...

కలసి ఉండడమే కష్టం.

కలసి ఉండలేరు.

ఒంటరిగా బ్రతకలేరు.

వింత మనుషులు!

వింత మనస్కులు!!

చుట్టూ మనుషుల మధ్య ఉన్నప్పుడు ఒంటరిగా ఉంటేనే బాగుండుననిపిస్తుంది. ఒంటరిగా ఉన్నప్పుడు అందరూ కావాలనిపిస్తుంది. ప్రస్తుతం నా పరిస్థితి అలాగే ఉంది. ఉద్యోగం వస్తే, అందరికీ దూరంగా నా అభిరుచులు మేరకు ఒంటరిగా హాయిగా ఎంజాయ్ చేయొచ్చు. కావలసినంత ఫ్రీడమ్! అని అనుకునేవాడిని తీరా అది అనుభవంలోకి వచ్చేసరికి అప్పుడే బాగుండేది అనిపిస్తోంది. ఎన్నిఉన్నా ఒంటర్ని అన్న ఫీలింగ్... లోన్లినెస్ వెంటాడుతూనే ఉంటుంది.

ఆ ఫీలింగ్‌ని పోగొట్టడానికా అన్నట్లు ఆరోజు విశాఖపట్నం వెళ్ళడం జరిగింది. జగదాంబా సెంటర్‌లో ఒక షాప్‌లో నన్ను ఆకర్షించిన ఒక అందమైన వాల్ డెకరేషన్! అంద మైన ప్రకృతి దృశ్యం క్రింద ఉన్న కొటేషన్ నాకు చాలా నచ్చింది. "యువిల్ నెవ్వర్ బి లోన్లీ ఇఫ్ నేచర్ ఈజ్ విత్ యు" నిజమే అందమైన ప్రకృతి మనకు తోడుగా ఉండగా మనం ఒంటరి ఎలా అవుతాం?

మనచుట్టూ ఎంతో అందమైన ప్రకృతి! అందమైన ప్రపంచం! వెంటనే కొనేశాను దాన్ని.

"విజయగనరం'లో బి.ఇడి చేస్తోన్న అమ్మాయి ఉందని మా నాన్నగారు చెప్పగా వినడం తప్ప మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. ఆ పెయింటింగ్ కొన్నరోజే మీరు విజయనగరం నుండి రావడం జరిగింది.

సాయంసంధ్యలో... మీ గార్డెన్‌లో ఉన్నారు అప్పుడు. మిమ్మల్ని చూసిన మొదటిక్షణం ఎప్పటికి మరిచిపోలేను

నిశ్చల మానస సరోవరం లాంటి నా మనసులో ఏదో తెలియని అలజడి!

మీ నల్లని పెద్ద పెద్ద కనులు మధ్య ఎర్రని బొట్టూ... నల్లని కొండల నడుమ నుండి సూర్యుడు ఉదయిస్తు న్నట్లు... ఆ సూర్యుని ప్రతిబింబం పెదవులపై పడి మరింత ఎర్రగా రేగే కురులు గగనాన్నీ... ఆ డ్రెస్ ఇంద్రధనస్సునూ... నన్ను చూసి పరిచయపూర్వకంగా నవ్విన నవ్వు ఉదయభానుని లేత కిరణాలను గుర్తు చేశాయి.

తొలిసంధ్యా మలిసంధ్యా తెలియని సుందర రూపం!

ఇదేమిటి, మిమ్మల్ని చూడగానే ప్రకృతి గుర్తుకు వచ్చింది?

ఒక అద్భుత సత్యం తెలిసిన క్షణం!

ప్రకృతి అంటే స్త్రీఅన్నమాట. స్త్రీ తోడుగా ఉన్నంత వరకూ ఎవరూ ఒంటరికాదు.

మగవాడి మనుగడకోసం...

మానవజాతి మనుగడకోసం... భగవంతుడు అందిం చిన అపురూపమైన కానుక ప్రకృతి... ప్రకృతి కాంత!

ఇంకోరోజు అప్‌స్టెయిర్స్‌లో ఉన్న నా రూమ్‌కి వెళుతూ మీకోసం మీ హాలులోకి చూసి... అలానే ఉండిపోయాను. సరస్వతిని గుర్తుకు తెచ్చే విధంగా మీరు వీణవాయిస్తున్న దృశ్యం! అంతవరకు సినిమా, టీవీలలో తప్ప వీణవాయించే అమ్మాయిని ప్రత్యక్షంగా చూడడం అదే మొదటిసారి!

ఆ వీణకు నాదాన్ని నేనయితే ఎంత బాగుణ్ను అనిపించిందా క్షణం!

కళ్ళు మాట్లాడుతాయనీ, నవ్వుతాయనీ ఎవరైనా అంటే అంతా ట్రాష్ అని కొట్టిపారేసిన నేను ఇప్పుడు... ఒకరితో ఒకరు మాట్లాడుకోపోయినా, ఎన్నో బాసలు అర్థమవుతున్నట్లనిపించింది!

ఎన్నోసార్లు మాట్లాడాలి అనుకున్నా అవకాశం రాక మాట్లాడలేకపోయాను.

రోజూ ప్రొద్దున్నా, సాయంత్రం మిమ్మల్ని చూడడం అలవాటయిపోయింది. ఉదయభానుని లేత కిరణాల మధ్య పూలుకోయడం, తులసి చెట్టుకు పూజచేయడం. సాయంసంధ్య నీరెండలో మీ పావురాలతో, కుందేలుతో ఆడుకోవడం... చూస్తున్న కొద్దీ చూడాలనిపించే అందమైన



పాదాలు... నిజం రేఖగారు! పచ్చని పచ్చికపై ఆ తెల్ల పాదాలముందు మీ తెల్లకుందేలు కూడా వెలవె

పోతున్నట్టు అనిపిస్తోంది.

ఇలాంటి ఎన్నో అనుభూతులు...

నేనుపొందిన అనుభూతినీ, ఆ అవ్యక్తభావాన్నీ, అనిర్వచనీయమైన ఆనందాన్నీ వ్యక్తం చేయాలంటే బహుశ అక్షరరూపంలో చెప్పలేనేమో!

ఎన్నో నిద్రలేని రాత్రులు...నిరాశతో నిండిన పగలు.

నిస్సారంగా రోజులు గడుస్తున్నాయి.

మదిలో ఇదీ అని చెప్పలేని భావం.

ఇది పలికే బాష మౌనం!

ఇలా అంతుతెలియని అంతర్మధనం నుంచి ఉద్భవించినదే అమృతతుల్యమైన ప్రేమ.

ఈమనో సంఘర్షణ రోజురోజుకు పెరిగిపోతోంది. మౌనంగా ఆరాధించే ఓపిక లేదు!

రేపు ఉగాది. నూతన సంవత్సరం! ఈ కొత్త సంవత్సరం మనప్రేమకూ, కలయికకూ శుభారంభం కావాలని నా ఆకాంక్ష!

మీ అభిప్రాయం కొరకు ఎదురు చూస్తూ...

-చైతన్య

★ ★ ★

చైతన్యగారికి,

చేదు, తీపి కలయికే జీవితం!

నేను చెప్పబోయే విషయం ఉగాది పచ్చడిలో చేదులా భావించి నన్ను అర్థం చేసుకుంటారని కొన్ని చేదులాంటి నిజాలు మీ ముందు ఉంచుతున్నాను.

బ్యాచ్‌లర్స్‌కి ఇల్లు ఇవ్వడానికి సాధారణంగా ఇష్టపడరు. ఎందుకంటే ఇలాంటి ప్రోబ్లమ్స్ ఫేస్ చేయవలసి వస్తుందని ముందుగానే ఊహిస్తారు కాబట్టి!

ముందు అమ్మావాళ్లు విముఖత చూపిస్తే, నాన్నగారు "మనకూ పిల్లలున్నారు, వాళ్ళూ రేపు ఉద్యోగాలు పేరిట బయటకు వెళితే ఇలాంటి సిట్యుయేషన్ ఎదురయితే, మనం ఎలాఫీల్ అవుతాం? అందరూఒకేలా ఉండరు" అని నచ్చచెప్పారట!

"బామ్మ ఇంట్లో అమ్మాయ్..." అని ఏదో చెప్పబోతే, 'కత్తి ఎంతపదునుగా ఉన్నా దానిపిడిని ఏమీ చేయలేదు' అని అన్నారట! మీరు కూడా చాలా జెంటిల్‌గా కన బడ్డారట! టీనేజ్ కుర్రాడుకూడా కాదు. అన్నీ తెలిసిన వాడు అని, ఎన్నోతర్జన భర్జనల అనంతరం మేడ మీదగది మీకు ఇచ్చారు.

నాన్నగారి ఆదర్శాన్నీ, ఇంట్లో వాళ్ళ మంచితనాన్నీ, నమ్మకాన్నీ మీరు వమ్ముచేశారు. ఇప్పుడు ఈ ప్రేమలేఖ విషయం తెలిస్తే... ఇంకేమైనా ఉందా?

అసలే అమ్మాయి పెళ్ళి విషయమై కృంగిపోయి ఉన్నారు.

ఎందుకూ? అని ఆశ్చర్యపోతున్నారా?

పైకి తెల్లగా అందంగా కనబడే మంచుపర్వతం వెనుక అంతర్‌ప్రవాహం ఉండొచ్చు. లావా ఉండొచ్చు! నేనుకూడా అంతే...

ఈ రేఖకు కళ్యాణరేఖ లేదు చైతన్యగారు!

ఎంతో ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెళ్ళి వారం ఉంది అనగా... వెడ్డింగ్స్ డిష్ట్రిబ్యూషన్‌కి వెళ్ళిన అతను యాక్సిడెంట్‌లో...

పెళ్ళి పందిరి పేకమేడలా కూలిపోయింది!

జీవితకాలపు అనుభూతిని మిగల్చవలసిన పెళ్ళి, జీవితకాలపు విషాదాన్ని మాత్రమే మిగిల్చింది!

నష్ట జాతకురాలు అని లోకం ముద్రవేసింది.

'పెళ్ళయ్యాక ఈ ఘోరం జరగలేదు' అని సర్ది చెప్పుకుని, ఆ కొండంత విషాదంలో, దురదృష్టంలో గోరంత అదృష్టాన్ని వెదుక్కుని, జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నాం!

కష్టసుఖాల కలయికలోనే జీవిత మాధుర్యం ఉందని అనుకోడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత. సంబంధాలు రావడం మానేశాయి. కారణం అమ్మాయి నష్ట జాతకురాలు!

నేను కళ్ళముందు ఉంటే ఇంకా కృంగిపోతారనీ, బి.ఇడి సీటు సంపాదించి ఈ పరిసరాలకు దూరంగావెళ్ళిపోయాను. ఇప్పుడే కాస్త కోలుకుంటున్నాం.

మళ్లీ 'ప్రేమ', 'పెళ్ళి' అని ఆ పీడకలను గుర్తు చేయకండి ప్లీజ్!

నాకు కూడా ఏ కోరికలూ లేవు.

బి.ఇడి పూర్తి చేసి ఏ అరకులోయకో వెళ్ళి అక్కడ అమాయకులైన గిరిజన ప్రజలకూ, నిరక్షరాస్యులకూ, నాకు తోచిన విధంగా ఏదో సహాయం చేస్తూ ప్రశాంతంగా నిష్కల్మషమైన మనుష్యుల మధ్య జీవించాలన్న ఆకాంక్ష తప్ప మరే విధమైన ఆలోచనలూ లేవు.

ఇక వీణ అంటారా దురదృష్టపు అపశృతిలో... ఒంటరితనంలో నాకు చేదోడు వాదోడుగా ఉండే అత్యంత ప్రియనేస్తాలు ఈ వీణా, ఆ నోరులేని మూగజీవాలు!

మనిషిలో ఏదో ఒక ఆకర్షణనూ, అందాన్నీ చూసి ప్రేమించడం చాలా తప్పు! అందంతో పుట్టిన ప్రేమ అందంలాగానే శాశ్వతంకాదు చైతన్యగారు.

మీరు ప్రేమ అని భ్రమపడుతున్నది, నిజానికి ప్రేమకాదు 'ఇన్‌ఫాట్యుయేషన్'.

మీ మనసును నొప్పించి నందుకు క్షంతవ్యురాలిని!

నన్ను అర్థంచేసుకునే అమృతహృదయం మీకుందనీ, అపార్థం చేసుకోరనీ... ఆశిస్తూ...

-రేఖ

★ ★ ★

ఉత్తరం చదవడం పూర్తిచేసిన చైతన్య శిలలా ఉండిపోయాడు.

ఉషోదయవేళ... 'శుభసంకల్పం ఆడియోకేసెట్‌లో లెటర్‌పెట్టి పంపిస్తే పాజిటివ్ రిప్లయ్ అని ఎంతో సంతోషించాడు తను! ఆ ఆనందం ఒక్క అర క్షణంకూడా నిలువలేదు!

తను ఎన్ని ఊహించుకున్నాడు!

మౌనాన్ని అర్ధంగీకారం అని భ్రమపడి అర్ధాంగిని చేసుకోవాలని ఎన్నో కలలు కన్నాడు.

'ప్రేమించబడడం ఒక వరం రేఖ' అని నచ్చచెప్పాలా?

ఒంటరితనపు అంధకారంలో క్రాంతిరేఖ అయి జీవితాన్ని కాంతిమయం చేస్తుందని ఎన్నో ఊహించుకున్నాడు తను!

అంతంలేని ఆలోచనలతో ఎంతసేపు అలా కూర్చున్నాడో అతనికే తెలియదు!

ఒక హృదయం స్పందింపచేయాలన్నా, స్థంబింపచేయాలన్నా అది కేవలం ఒక్క స్త్రీకే సాధ్యం అన్న సత్యం అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు చైతన్య.

ద్వారం దగ్గర అలికిడి అయితే అటుచూసిన చైతన్య తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు!

ఎదురుగా రేఖ!

ఎందుకు వచ్చిందో తెలియని స్థితి!

ఆమె చేతులు కదిలాయి... రెండు అరచేతులను గోరింటాకు పెట్టుకున్న చేతులను చూపిస్తున్నట్టుగా దగ్గరకు చేర్చి చూపించింది!

రెడ్‌స్కెచ్‌తో వ్రాయబడిన అక్షరాలను చదివిన చైతన్య ముఖంలో వెలుగు... మళ్ళీ మళ్ళీ చదివాడు... 'సారీ ఏప్రిల్ ఫస్ట్' అని వ్రాయబడి ఉంది.

అంతవరకు తెలీలేదు అతనికి ఆరోజు ఉగాది మాత్రమే కాదు. ఏప్రిల్ ఫస్ట్ అనికూడా..

అల్లరిగా నవ్వుతోంది రేఖ!

'ఐ లవ్ యూ' అని చెప్పేసి గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోబోయిన రేఖ... కాలుస్లిప్పయి ముందుకు తూలి పడిపోబోవడం... ఆమెకు పడకుండా అతను రెండు చేతులతో అందుకోవడం క్షణంలో జరిగిపోయింది. ఆమె సెన్సాఫ్‌హ్యూమర్‌ను మనస్ఫూర్తిగా అభినందించాడు.

ఒక మౌనం పలికిన వేళ!

ఒక సుమధుర స్వప్నం నిజమైన వేళ!!

సృష్టిలో తీయనిది మధురం అని మాత్రమే తెలిసిన చైతన్య, రేఖలకు అంతకన్నా తీయనిది 'అధరామృతం' అని తెలిసిన క్షణం!

అపురూపమైన ఆ కలయికకు అది ఆరంభం మాత్రమే!

కంటపల్లి సన్యాసిరాజు,
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్,
ఆర్మూర్ బ్రాంచ్,
నిజామాబాద్ జిల్లా.